క్లుప్తంగా

ముగిసిన సప్తాహ ప్రవచన జ్ఞాన యజ్ఞం



పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ శారదా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో 108వ శ్రీమద్భాగవత పారాయణ పూర్వక సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదమూర్తులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు నిర్వహణలో గణపతి, రుద్ర, చండీ, నవగ్రహ, మహామంత్ర, మండప దేవతా హోమాలతో పాటు పూర్ణాహుతి, వేదాశీర్వచనం, పండిత సన్మానాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో వేద మూర్తులు చంద్రశేఖర ఘనాపాటి, మద్దులపల్లి దత్తాత్రేయశాస్త్రి, ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరి ప్రసాదరావు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

జీపాట్ ఫలితాల్లో చలపతి ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: నైపుణ్యం కలిగిన విద్యా విధానాల ద్వారా తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాల్ని సాధిస్తున్నారని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు పేర్కొన్నారు. నగర శివారులోని లాం నందున్న కళాశాలలో ఆదివారం జరిగిన విద్యార్థులు అభినందన సభలో ఆయన మాట్లాడారు. జీపాట్–2023 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం సంతోషకరమన్నారు. గత నెల 22న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) జీపాట్ పరీక్షను అఖిల భారత స్థాయిలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు 14 మంది జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని వెల్లడించారు. వీరిలో ఎన్.ముఖేష్ 1636, ఎ.శ్రావణి 1772, ఎస్.సోను 2286, షేక్ సాజిద్ 2844 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థుల్ని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది –అభినందించారు.

పేలవంగా టీడీపీ బస్సుయాత్ర

గుంటూరు రూరల్: టీడీపీ బస్సుయాత్ర ఆదివారం పేలవంగా సాగింది. గోరంట్ల నుంచి ఇన్నర్ రింగ్‌రోడ్డు మీదుగా టిడ్కో గృహాల సందర్శన, ఆర్‌టీవో కార్యాలయం వద్ద భోజనాలతో మధ్యాహ్నం ముగిసింది. అనంతరం సాయంత్రం ఏటుకూరు రోడ్డు నుంచి మొదలై వట్టిచెరుకూరు మండలం మీదుగా రాత్రి బసకు చేరారు. యాత్ర ఆ సాంతం ఎవరికి వారే ఎమునా తీరే అన్నట్లు సాగింది. యాత్రలో గోరంట్లలో మాకినేని పెదరత్తయ్య పాల్గొన్నారు. అడవితక్కెళ్ళపాడులో ప్రత్తిపాటి పుల్లారావు, నజీర్‌అహ్మద్, రాయపాటి శ్రీనివాస్ హాజరయ్యారు. ఎవరికి వారు వచ్చి ఒకటీ, రెండు సెల్ఫీలు తీసుకుని వెళ్లిపోయారు.

వంగవీటి పోరాటం స్ఫూర్తిదాయకం

తెనాలి: బడుగు బలహీనవర్గాలకు అండగా అనేక పోరాటాలు చేసిన వంగవీటి మోహనరంగా జీవితం స్ఫూర్తిదాయకమని యునైటెడ్ ఇండిపెండెంట్స్ విద్యార్థి సంఘం (యూఐ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తుర్లపాటి సురేష్ అన్నారు. వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ప్రచురించిన 'వంగవీటి చైతన్య రథ సారథులు' పుస్తకాన్ని ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆవిష్కరించారు. పుస్తక రచయిత తుర్లపాటి సురేష్ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగాతో తనకున్న అనుబంధాన్ని, ఆయన పోరాట స్ఫూర్తిని, నడిపిన ప్రజా ఉద్యమాలపై సోషల్ మీడియా సాక్షిగా తాను వ్యక్తీకరించిన జ్ఞాపకాలే ఈ పుస్తకమని చెప్పారు. ప్రచురించిన సేవాసమితి అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ అభినందనీయులన్నారు. రంగా మరణించి 35 ఏళ్లవుతున్నా, ఆయన ఇంకా ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగానే ఉన్నారనీ, ఇప్పటికీ పలుచోట్ల ఆయన విగ్రహాల ఆవిష్కరణలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. వంగవీటి రాధా రంగ కాపు యువజన సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ రంగా ముఖ్యఅనుచరుడిగా, యూఐ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రంగాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన తుర్లపాటి సురేష్ రచనలను పుస్తకంగా తీసుకొచ్చే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రంగా కేవలం ఒక సామాజికవర్గానికి మాత్రమే చెందిన వ్యక్తి కాదనీ, ఆయన అందరివాడిగా ఈ పుస్తకం నిరూపిస్తుందని చెప్పారు. వంగవీటి రాధా రంగా మిత్రమండలి వ్యవస్థాపకుడు చెన్నుపాటి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తోటకూర వెంకట రమణారావు, మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య, న్యాయవాది పొన్నం విజయకుమార్, రఘుపతి వెంకటరత్నం, కాపు వసతిగృహ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలిశెట్టి విజయ్, గాదె విజయకుమార్ పాల్గొన్నారు.

ఐఐటీల్లో సీట్లు సాధించడం నగరానికి గర్వకారణం

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, పక్కన భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: నగర విద్యార్థులు దేశంలో అత్యున్నత సాంకేతిక విద్యాసంస్థలుగా పేరు గాంచిన ఐఐటీల్లో సీట్లు సాధించడం గర్వకారణమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా టాప్–10లో ఓపెన్ కేటగిరీలో 5, 10వ ర్యాంకులు కైవసం చేసుకున్న భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు ఏ. వెంకట శివరామ్, వై.వి. మణీందర్‌రెడ్డికి ఆదివారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం ప్రధాన క్యాంపస్ వద్ద విద్య, వైద్య, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ ఐఐటీ ముంబైలో విద్యను అభ్యసించేందుకు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆలిండియా ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఏ.వి. శివరామ్, వై.వి.మణీందర్‌రెడ్డి ఉన్నత విద్యాభ్యాసానికి రూ.10 లక్షలు చొప్పున రూ.20 లక్షలను భాష్యం రామకృష్ణ అందించడం ముదావహమన్నారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ 60 ఏళ్ల ఐఐటీ చరిత్రలో గుంటూరు జిల్లా నుంచి మొట్ట మొదటిసారిగా ఓపెన్ కేటగిరీలో అఖిలభారత స్థాయిలో 5, 10వ ర్యాంకులు సాధించడం ద్వారా భాష్యం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందన్నారు. అంతటి ఘన విజయానికి కారకులైన అధ్యాపక బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. సభలో పాల్గొన్న మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ భాష్యం విద్యాసంస్థలు జిల్లాకు గర్వకారణంగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ ప్రోగ్రామర్ ఆనంద్‌కుమార్, భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, ముఖ్య సలహాదారు మైకేల్‌రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, జెడ్ఈవోలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి మహేంద్రనాథ్‌కు ఘన నివాళి



మహేంద్రనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు

నెహ్రూనగర్: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో నాలుగు దశాబ్దాల కిందట దళిత నాయకుడిగా, ఆరు పర్యాయాలు శాసనసభ్యుడిగా, నలుగురు ముఖ్యమంత్రుల వద్ద పదికి పైగా మంత్రిత్వ శాఖలు నిర్వహించి, నిజాయతీకి నిలువెత్తుగా నిలిచిన పుట్టపాగ మహేందర్‌నాథ్ సామాజిక, రాజకీయ సేవలు వర్తమాన భావితరాలకు ఆదర్శప్రాయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. బ్రాడీపేటలో ఆదివారం పుట్టపాగ రవీంద్రనాథ్ సంస్మరణ సభ నిర్వహించారు. సీనియర్ న్యాయవాది, సామాజిక ఉద్యమకారుడు సంకూరి రాజారావు అధ్యక్షత వహించిన ఈ సంస్మరణ సభలో స్మారక సంచికను ఆవిష్కరించిన అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మాణిక్య వరప్రసాద్ మాట్లాడారు. ఎన్టీరామారావు మంత్రివర్గంలో రెవెన్యూ, ఆర్థిక శాఖ మంత్రిగా మహేందర్‌నాథ్ కరణాలు, మున్సబుల వ్యవస్థల్ని రద్దుచేసి విప్లవాత్మక మార్పుకు నాంది పలికారన్నారు. పదవి లేని సమయంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి సాధారణ జీవితం గడపడం ఆయన నిజాయతీకి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ మహేంద్ర నాథ్ జీవితం త్యాగపూరితమైనదని కొనియాడారు. కర్ణాటక అటవీశాఖ డీజీపీ పుట్టపాగ రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు తన తండ్రి విశేషంగా కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు దళిత, బహుజన నాయకులు పాల్గొన్నారు.

నేడు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శాకంబరీ ఉత్సవం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆషాఢ మాస శాకంబరీ ఉత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు తెలిపారు. ఆలయంలో ఆదివారం కార్యక్రమాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో అమ్మవారికి విశేషంగా గోరింటాకు అలంకారం, మూలా నక్షత్రం, పౌర్ణమి సందర్భంగా అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు పసుపు కుంకుమ, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా భక్తులతో అమ్మవారికి సారే సమర్పణ జరుగుతుందని తెలిపారు. 12 గంటలకు మహా నైవేద్యం, మంత్రపుష్పం, మంగళ హారుతులు, తీర్థప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. సాయంత్రం జగన్నాథ మహిళా మండలి వారి కోలాట భజన నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సూపరింటెండెంటు తనిఖీలు



తనిఖీలు చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ జనరల్ మెడిసిన్ వైద్య విభాగాన్ని సూపరింటెండెంటు డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులో సుమారు 10 మంది రోగులు మంచాలు సరిపడా లేక స్ట్రెచ్చర్‌ల పైనే చికిత్స పొందడాన్ని గమనించి తక్షణమే అదనంగా 50 పడకలు మంజూరు చేశారు. బాత్‌రూమ్‌ల తలుపులు విరిగిపోయి, అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైప్ లైన్ నుంచి నీరు వృథాగా పోవడాన్ని గమనించి తక్షణమే రిపేర్లు చేయించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు.

ఏఎంసీ విభాగం తనిఖీ

జనరల్ మెడిసిన్ విభాగంలో తనిఖీల అనంతరం డాక్టర్ కిరణ్‌కుమార్ ఎక్యూట్ మెడికల్ కేర్ యూనిట్(ఏఎంసీ)లో తనిఖీలు చేశారు. మెడికల్ ఐసీయూలో పరిశుభ్రత లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణమే క్లీనింగ్ చేయాలని ఆదేశించారు. రోగుల సహాయకులు అధిక సంఖ్యలో ఏఎంసీలోకి వస్తున్నారనే విషయాన్ని గమనించి, తక్షణమే వారిని కట్టడి చేసేలా అక్కడ సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. తనిఖీల్లో సూపరింటెండెంటుతో పాటు సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవం



తెనాలి టౌన్: పట్టణ ఐతానగర్‌లోని షిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మందిరంలో లిల్లీపూలతో సాయిబాబాకు అష్టోత్తరం చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి అఖండ ఏక నామ సంకీర్తన జరిపారు. ఓంసాయి శ్రీ సాయి జయ జయ సాయి అంటూ సంకీర్తన చేశారు. అనంతరం 108 మందితో శత కలశపూజ జరిపారు. సాయంత్రం ఆరు గంటలకు 108 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం మందిరం ఆవరణలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నృత్య కళాకారిణిలకు సన్మానం



తెనాలి అర్బన్: తెనాలికి చెందిన గ్రీష్మశ్రీ, తహసీన్‌లను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు. దత్తాత్రేయ ఆహ్వానం మేరకు వీరు హైదరాబాద్‌లో నృత్య ప్రదర్శన ఆదివారం చేసినట్లు బాలికల తల్లిదండ్రులు అరుణకుమారి, షేక్ రఫీ, ఆలియా తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన గురువు నిర్మలా రమేష్‌ను అభినందించారు.

ట్రాలీ బోల్తా.. మహిళకు గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ట్రాలీ ఆటో బోల్తా పడటంతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన నారాకోడూరులో ఆదివారం జరిగింది. వేమూరు మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన జి.రమణ తెనాలి నుంచి ట్రాలీలో చేపలను గుంటూరుకు తీసుకెళ్తున్నాడు. నారాకోడూరు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రమణకు తలకు తీవ్ర గాయమైంది. కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితురాలిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి



మాట్లాడుతున్న పీఆర్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని పీఆర్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లాడ్జి సెంటర్లోని ఎల్ఎంపీ స్కూల్లో ఆదివారం జరిగిన పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై ఒకటో తేదీ నుంచి ఉద్యోగులకు నూతన వేతన సవరణ స్కేల్ అమలు పర్చాలని కోరారు. డీఏ బకాయిలతో పాటు 11వ పీఆర్సీ బకాయిలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్లస్ టూ స్కూళ్లలో నియమించిన పీజీటీలకు జాబ్ చార్ట్‌ను అమలు పర్చడంతో పాటు వారికి వేతనాలు చెల్లించాలని కోరారు. ఎంఈవో–1, 2 పోస్టులకు జాబ్‌చార్ట్ విడుదల చేసి, భర్తీ చేయగా మిగిలిన ఎంఈవో–1 పోస్టులను జెడ్పీ హెచ్‌ఎంలతో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇటీవల బదిలీలు, ఉద్యోగోన్నతులు పొందిన పీఆర్టీయూ నాయకులు, కార్యకర్తల్ని సత్కరించారు. సమావేశంలో భాగంగా సంఘ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ రజాక్‌తో పాటు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా వీసీహెచ్ ముక్కంటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి జె. సుధీర్, బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. రాంబాబు, ఏ.వి.నారాయణ, నాయకులు ఎస్‌పీసీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

నగర శివారులో వ్యక్తి దారుణ హత్య



బాషా మృతదేహం

గుంటూరు రూరల్: నగర శివారులోని నిర్జన ప్రదేశంలో ఓ వ్యక్తి హత్యగురైన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. మంగళగిరి రూరల్ మండలం కురగల్లుకు చెందిన షేక్ బాషా(38) నగర శివారులోని కృష్ణబాబు కాలనీలో అద్దెకు ఇల్లు తీసుకుని నివసిస్తున్నాడు. లారీలకు పెయింట్ వర్క్ చేస్తూ జీవిస్తున్నాడు. బాషాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి, తెల్లవారుజామున ఓ ఫోన్ కాల్ రావడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం భవానీపురం శివారులో ప్లాట్ల వద్ద తీవ్రగాయాలతో శవమై కనిపించాడు. ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి నల్లపాడు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతదేహంపై తీవ్ర గాయాలు, గాట్లు ఉండటంతో హత్యకు కత్తులు వినియోగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. స్నేహితుల మధ్య వివాదాలే హత్యకు కారణమా.. లేక ఇంకా ఏవైనా వివాదాలున్నాయా? మద్యం మత్తులో జరిగిన వివాదంలో హత్య చేశారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. ఘటన స్థలిలో సేకరించిన ఆధారాల ప్రకారం విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు

కిలోన్నర గంజాయి స్వాధీనం



వడ్లమూడి క్వారీ దేవస్థానం వద్ద ఆషీర్‌ను అదుపులోకి తీసుకున్న ఎస్ఐ జి.వెంకటాద్రి, తహసీల్దారు గోపాలకృష్ణ

చేబ్రోలు: స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు గంజాయిను విక్రయిస్తున్న యువకుడ్ని చేబ్రోలు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ ఆషీర్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గంజాయి తాగడం అతనికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో కొంతకాలం నుంచి గుంటూరు నుంచి గంజాయిను కొనుగోలు చేసుకొని నారాకోడూరు, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లోని స్పిన్నింగ్ మిల్లుల్లో పనిచేసే కార్మికులకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందడంతో ఎస్ఐ జి. వెంకటాద్రి ఆధ్వర్యంలో పోలీసులు పథకం ప్రకారం నిందితుడిని అరెస్ట్ చేశారు. వడ్లమూడి క్వారీ దేవస్థానం ప్రాంగణం వద్ద ఎస్ఐ జి వెంకటాద్రి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ వాహనాల తనిఖీ చేసే సమయంలో సైకిల్‌పై అనుమానాస్పదంగా వెళ్తున్న ఆషీర్‌ను తనిఖీ చేయగా కిలోన్నర గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీలో ముగ్గురికి కారుణ్య నియామకాలు



నియామకపత్రం అందజేస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ కార్యాలయం పరిధిలో ముగ్గురు అభ్యర్థులకు జూనియర్ అసిస్టెంట్లుగా కారుణ్య నియామకాల్ని కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామకపత్రాలు అందజేశారు. ఆదివారం జెడ్పీ ప్రాంగణంలోని క్యాంపు కార్యాలయంలో డి. భరత్‌రెడ్డికి అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయం, పి. రమ్యదీప్తికి తెనాలి ఎంపీడీవో కార్యాలయం, షేక్ పర్వీన్‌కు చిలకలూరిపేటలోని జెడ్పీ హైస్కూల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన వారు కష్టపడి పని చేయాలని, విధి నిర్వహణలో సీసీఏ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ పరిపాలనాధికారి గరికపాటి శ్రీనివాసరావు, పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు రమేష్, ఏవో హేమంత్ పాల్గొన్నారు.

ఘనంగా రక్షణ సైన్య ప్రార్థన మందిర వ్యవస్థాపక దినోత్సవం

తెనాలి అర్బన్: ఐతానగర్‌లోని రక్షణ సైన్యం ప్రార్థన మందిర వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి ముందు ఏర్పాటు చేసిన సంస్థకు చెందిన జెండాను ఎగురవేశారు. మేజర్ వి.యేసుపాదం మాట్లాడుతూ రక్షణ సైన్య ప్రార్థన మందిరాన్ని జనరల్ విలీయం, కేథరిన్ లండన్‌లో 1965 జూలై రెండున ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేజర్ వి.ప్రశాంతకుమారి, మేజర్ పి.నాగరాజు, పి.రత్నసుందరి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కర్రసాము ప్రాచీన సంప్రదాయ యుద్ధ కళ

మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఎండీ మేకతోటి దయాసాగర్



విజేతలతో మేకతోటి దయాసాగర్ తదితరులు

గుంటూరు రూరల్: మన సంప్రదాయ ప్రాచీన యుద్ధ కళల్లో కర్రసాము ఒక రక్షణ కళని మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ తెలిపారు. ఆదివారం జొన్నలగడ్డలో సిలంబం అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కర్రసాము పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా దయాసాగర్ పాల్గొన్నారు. క్రీడలు, కళల ద్వారా ఆరోగ్యంతోపాటు శరీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. మానసిక ప్రశాంతత, మేధస్సు మెరుగుపడుతుందన్నారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమని, నైపుణ్యం సాధించి, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు క్రీడాకారులు కృషి చేయాలని ఆయన సూచించారు. కర్రసామును విద్యార్థినులంతా రక్షణగా అభ్యసించాలని దయాసాగర్ తెలిపారు. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

జిల్లా వ్యాప్తంగా 125 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వంగా నవీన్‌రెడ్డి, శివ మకుటం, దాసరి రాము, తులసీ హాస్పిటల్స్ డాక్టర్ అభిషేక్, భజరంగ్ రామకృష్ణ, అసోసియేషన్ జిల్లా కార్యవర్గం పాల్గొన్నారు.

'ఆహార వైద్యం' పుస్తకావిష్కరణ



ఆహార వైద్యం పుస్తకావిష్కరణలో ఆలపాటి రాజా, రాజకుమారి, సాయిలక్కరాజు

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంకు అధికారి, స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత సాయి లక్కరాజు 30 ఏళ్ల సాహిత్య ప్రస్థానం సభను ఆదివారం ఉదయం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో దైవాల సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై, సాయి లక్కరాజు 10వ రచన 'ఆహార వైద్యము'ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటికాలంలో మనిషి ప్రకృతి నుంచి దూరంగా వెళుతున్నాడని చెప్పారు. ఏదైనా అనారోగ్యం కలిగితే అప్పటికప్పుడు తక్షణ ఉపశమనం కోసం చూస్తున్నాడని తెలిపారు. ఫలితంగా అనారోగ్యాలు, మందుల వాడకం ఎక్కువైందని చెప్పారు. సాయి లక్కరాజు 223 రకాల స్వల్పకాలిక వ్యాధులకు మన ఇంట్లో ఆహారంలో వినియోగించే పదార్థాలతో ఉపశమనం పొందవచ్చంటూ రాసిన పుస్తకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ వైద్యం ఎంతగా విస్తరించినా మనిషి రోజువారీ మందుల ఖర్చులు పెరిగాయని గుర్తుచేశారు. దీనికి పరిష్కారంగా సాయి లక్కరాజు వంటింటి పదార్థాలతోనే అనేక బాధల నుంచి ఉపశమనం పొందే వైనాన్ని చక్కగా సరళమైన భాషలో రాయటం సంతోషంగా ఉందన్నారు. పలు రోగాలనూ నివారించుకోవచ్చని చెప్పారు. పుస్తకాలనూ, మొక్కలను బహుమతిగా ఇవ్వటం నేర్చుకోవాలని సూచించారు. సాయి లక్కరాజు మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట తన తొలి కవిత ఇదే నెలలో ప్రచురితమైందని గుర్తుచేసుకున్నారు. పది పుస్తకాలు రాసినా, ఆవిష్కరణకు వెళ్లటం ఇదే తొలిసారిగా చెప్పారు. ఆహార వైద్యము పది మందికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే ఇందుకు పూనుకున్నట్టు చెప్పారు. రోగనిరోధక శక్తినీ ఇంట్లోని వస్తువులతోనే పెంచుకోవచ్చని చెప్పారు. రాయపాటి ప్రేమ్‌కుమార్ స్వాగతం పలికారు.

వృద్ధాప్యంలో శరీరంలో పలు మార్పులు



డాక్టర్ విజయసాగర్‌కు సత్కారం

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి జూలై నెల సమావేశం ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఫిజియోథెరపిస్టులు డాక్టర్ జి.విజయసాగర్, డాక్టర్ జి.దీప్తి హాజరయ్యారు. 'ఫిజియోథెరపీ– ప్రాముఖ్యత'పై డాక్టర్ విజయసాగర్ ప్రత్యేక ప్రసంగం చేశారు. వయసు పెరిగి వృద్ధాప్యం వచ్చేటప్పటికి శరీరంలో అనేక మార్పులు వచ్చి కండరాలు, నరాలు, కీళ్లు, ఊపిరితిత్తులు పనిచేయటం తగ్గుతుందని చెప్పారు. స్వల్పమైన వ్యాయామాలతో దీనిని నివారించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆయన్ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో సభ్యులు నరేంద్ర, సాంబశివరావు, కుమార్, రంగారావు, గోపాలరావు ప్రభృతులు పాల్గొన్నారు.